క్లుప్తంగా

ఇసుక ర్యాంపుల పరిశీలన



తాలాడ వద్ద ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న అధికారుల బృందం

భామిని: మండల పరిధిలో వంశధార నదీతీరంలో ఇసుక లభ్యతను భూగర్భ గనులశాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. శ్రీకాకుళం నుంచి వచ్చిన ఆశాఖ అధికారులు మండల సర్వేయర్ తోట రామ్మోహనరావుతో కలిసి లివిరి, నేరడి–బి, తాలాడ గ్రామాల్లో ఇసుక ర్యాంపులను పరిశీలించారు. గతంలో ఆయా ర్యాంపుల్లో ఇసుక తవ్వకాలు జరిగేవి. ఇసుక లభ్యత తగ్గిపోవడంతో కొంతకాలంగా తవ్వకాలు నిలిచిపోయాయి. ఇసుక కొరత కారణంగా నిర్మాణ పనులు నిలిచిపోతున్నాయని గడపగడపకు మన ప్రభుత్వంలో ప్రజలు వినతులు ఇవ్వడంతో అధికారులు ఆయా ర్యాంపులను పరిశీలించారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు వై.పాపినాయుడు, వెంకటరమణ, సొసైటీ చైర్మన్ గెల్లంకి రమేష్, మాజీ జెడ్పీటీసీ ఎస్.గోపాల్ తదితరులు ఉన్నారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ తప్పనిసరి



లబ్ధిదారుల సందేహాలను నివృత్తి చేస్తున్న అధికారులు

భామిని: బత్తిలిలో జగనన్న కాలనీ లేఅవుట్లను హౌసింగ్ ఈఈ తమ్మినేని రమేష్ బుధవారం పరిశీలించారు. ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు స్థల డాక్యుమెంట్ల కాపీలు అందించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన వారికి గృహాల మంజూరుకు మార్గం సుగమం అవుతుందని వివరించారు. లబ్ధిదారుల అనుమానాలను నివృత్తి చేశారు. ఆయనతో పాటు ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు, హౌసింగ్ ఏఈ గుంప అప్పలనాయుడు, ఎంపీటీసీ టింగ అన్నాజీరావు, కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు ఉన్నారు.

పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి

గరుగుబిల్లి: గ్రామ పంచాయతీల నుంచి శాఖా గ్రంథాలయాలకు రావాల్సిన సెస్సు(పన్ను) బకాయిల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు ఆదేశించారు. మండలంలోని రావుపల్లి, కొత్తపల్లి గ్రామ సచివాలయాలను బుధవారం ఆయన సందర్శించారు. కార్యాలయ రికార్డులు పరిశీలించారు. ఇంటి పన్ను, గ్రంథాలయ సెస్సు వసూళ్ల వివరాలను కార్యదర్శుల వద్ద ఆరా తీశారు. ఆయన వెంట సర్పంచ్‌లు బొంతాడ మహేశ్వరరావు, గొట్టాపు శ్రీవేణి, శాఖాగ్రంథాలయ నిర్వాహకులు ఎస్.మధుసూదనరావు ఉన్నారు.

సీసీ కాలువల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భామిని: మండలంలోని సింగిడి గ్రామంలో ఏబీ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీల నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, ఎంపీటీసీ టింగ అన్నాజీరావు బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన స్థానిక సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. కాలువల నిర్మాణానికి రూ.10 లక్షలు నిధులు మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ మడపాన కేశవరావు, మండల వైశ్య సంఘ కార్యదర్శి గుడ్ల షణ్ముఖరావు, పార్టీ నాయకులు తాశాసు మధు, భోగి అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

భారీగా సారా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సారా నిల్వలతో ఎస్‌ఈబీ అధికారులు

పాలకొండ రూరల్: పట్టణంలోని రెల్లివీధిలో ఎస్‌ఈబీ అధికారులు బుధవారం చేపట్టిన తనిఖీల్లో భారీగా సారా నిల్వలు గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈబీ సీఐ ఎంవీ గోపాలకృష్ణ మాట్లాడుతూ సీతంపేట మండలం నారాయణగూడ నుంచి 350 లీటర్ల సారాను పాలకొండ పట్టణంలోకి తీసుకొచ్చినట్లు సమాచారం అందడంతో తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. నారాయణగూడకు చెందిన ముగ్గురు వ్యక్తులతో పాటు రెల్లివీధికి చెందిన ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. సారా తయారీ, రవాణా చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తరహా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారం అధికారులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.



సీతంపేట: ర్యాలీ చేస్తున్న పీఓ నవ్య, తదితరులు



వీరఘట్టం: విద్యార్థులతో కలిసి ర్యాలీ చేస్తున్న రెవెన్యూ అధికారులు



గుమ్మలక్ష్మీపురం: సీనియర్ సిటిజన్లను సన్మానిస్తున్న తహసీల్దార్ రాములమ్మ, ప్రజాప్రతినిధులు



గరుగుబిల్లి: మండల కేంద్రంలో ర్యాలీ చేస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ, రెవెన్యూ సిబ్బంది

యువతా మేలుకో.. ఓటు విలువ తెలుసుకో..



జియ్యమ్మవలస: దివ్యాంగ ఓటర్లను సన్మానిస్తున్న తహసీల్దార్ సీతారామయ్య

- ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం
- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

కురుపాం: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని, ప్రజా ప్రతినిధులను ఎన్నుకునే ముందు ఆలోచించి ఓటు వేయాలని పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం కురుపాంలో తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. యువతా ఓటు విలువ తెలుసుకో.. దేశభవిత మలుచుకో..., ఎన్నికలే ఒక యుద్ధం..ఓటే వజ్రాయుధం అంటూ నినాదాలు చేశారు. ప్రతి ఒక్కరూ ఓటురు జాబితాలో పేరు నమోదు చేసుకోవడంతో పాటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని సబ్‌కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణ, ఆర్‌ఐ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ పద్మిని సువర్ణ, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- సీతంపేట: ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.నవ్య ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. సీతంపేట నుంచి ఐటీడీఏ వరకు ఓటరు చైతన్య ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ నర్సింహమూర్తి, ఎంపీడీఓ కోసూరు గీతాంజలి, ఐటీడీఏ సిబ్బంది పాల్గొన్నారు.



కురుపాం: ఓటరు దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్, తదితరులు

- గరుగుబిల్లి: మండలంలోని గరుగుబిల్లి, పెద్దూరు, రావివలస, రావుపల్లి, గొట్టివలస, చినగుడబ, తోటపల్లి, కొత్తూరు, నాగూరు తదితర గ్రామాల్లో బీఎల్‌ఓల ఆధ్వర్యంలో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఓటు హక్కు ఆవశ్యకతపై విద్యార్థులు, గ్రామస్తులకు అవగాహన కల్పించడంతో పాటు ఓటు హక్కు వినియోగించుకుంటామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. మండల కేంద్రంలో తహసీల్దార్ అజురఫీజాన్ ఆధ్వర్యంలో ఓటరు చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ జి.పైడితల్లి, డీటీ లక్ష్మీకుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.
- గుమ్మలక్ష్మీపురం: దేశ పౌరులకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పౌరులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కుంబురుక దీనమయ్య అన్నారు. తహసీల్దార్ జె.రాములమ్మ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఓటురు దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జాతి, కులం, మతం, లింగ బేధాలు లేకుండా 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం ఓటు హక్కు కల్పించిందని, అర్హులైన యువత ఓటర్లుగా పేరు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురు సీనియర్ సిటిజన్లకు సన్మానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మండంగి రాధిక, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, సర్పంచ్‌లు గౌరీశంకరరావు, చైతన్య స్రవంతి, ఎంపీడీఓ సాల్మన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.
- జియ్యమ్మవలస: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీఎల్‌ఓలు ఓటర్లకు ఓటు హక్కు ఆవశ్యకతను వివరించారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. మండల కేంద్రంలో తహసీల్దార్ కేవీ సీతారామయ్య ఆధ్వర్యంలో ఓటురు చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు, దివ్యాంగ ఓటర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.
- పాలకొండ: ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు కోరారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి పట్టణంలో ఓటరు చైతన్య ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కళాశాల ప్రిన్సిపాల్ జనార్ధనరావు, అధ్యాపకులు, ఉప తహసీల్దార్ బుచ్చయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.
- పాలకొండ రూరల్: అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లోలుగు విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీ వాకముడి అనీల్‌కుమార్, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రణస్థలం రాంబాబు తదితరులు పిలుపునిచ్చారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం అంపిలి, ఎం.సింగుపురం గ్రామ సచివాలయాల్లో ఓటురు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.
- వీరఘట్టం: ఓటు వజ్రాయుధమని, ఆలోచనతో దాన్ని వినియోగించుకుని సరైన ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని తహసీల్దార్ సీహెచ్ సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో సిబ్బందితో కలిసి చైతన్య ర్యాలీ నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం ఇటీవల కొత్తగా ఓటు హక్కు పొందిన వారికి ఓటరు గుర్తింపు కార్డులు అందజేశారు. ఎంపీడీఓ ఎ.ప్రభాకరరావు, ఆర్‌ఐ ప్రసాదరావు, వీఆర్వో పి.రఘునాయుడు, జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.
- భామిని: మండల కేంద్రం భామినిలో తహసీల్దార్ నీలాపు అప్పారావు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఓటు హక్కు వినియోగంపై చైతన్య ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏపీ మోడల్ స్కూల్, గురుకుల పాఠశాల విద్యార్థులు ప్లెకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. నేరడి–బి ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



భామిని: భామినిలో ర్యాలీ చేస్తున్న రెవెన్యూ అధికారులు



పాలకొండ: ఓటరు చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ, డిగ్రీ కళాశాల సిబ్బంది



పాలకొండ రూరల్: అంపిలిలో ఓటు హక్కు ఆవశ్యకతను వివరిస్తున్న వైస్ ఎంపీపీ అనిల్‌కుమార్, తదితరులు



పాలకొండ రూరల్: ఎం.సింగుపురంలో చైతన్య ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, స్థానిక ప్రజా ప్రతినిధులు

జగనన్నతోనే సంక్షేమ పాలన



సరుగుడుగూడలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కొమరాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని ఉలిపిరి, అల్లువాడ, రామభద్రపురం, సరుగూడ తదితర గ్రామాల్లో బుధవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ప్రతీ గడపలో మహిళలు ఎమ్మెల్యేకు హారతులు పట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, మన రాష్ట్రంలో అమలవుతున్నన్ని పథకాలు మరే రాష్ట్రంలోనూ అమలు కావడం లేదన్నారు. సంక్షేమ పాలనలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ వారి గడప వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని అన్నారు. ఇళ్లులేని పేదలకు ఇళ్ల స్థలాలు, గిరిజనులకు పోడు పట్టాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎల్.వి.అప్పారావు, విద్యుత్ శాఖ జేఈ వెంకటరమణ, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బావుజీ నాయుడు, ఎంపీపీ శెట్టి శ్యామల, జడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, మండల కన్వీనర్ డి.జనార్దనరావు, వైస్ ఎంపీపీలు నంగిరెడ్డి శరత్‌బాబు, కేంద్రక అన్నపూర్ణ, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు కళింగి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పనులకు హాజరుకాకుంటే జాబ్‌కార్డు రద్దు

పాలకొండ రూరల్: జాబ్‌కార్డు పొందినవారు ఉపాధి పనులకు హాజరుకాకుంటే వారి గుర్తింపు కార్డును రద్దు చేస్తామని ఎంపీడీఓ డొంక త్రినాథులు స్పష్టం చేశారు. ఉపాధి అధికారులు, క్షేత్ర సహాయకులతో బుధవారం సమావేశమయ్యారు. ఉపాధి సిబ్బంది, వేతనదారులు సకాలంలో పనులకు హాజరుకావాలని, పని ప్రదేశంలో క్షేత్రసహాయకులు కచ్చితంగా ఉండాలన్నారు. వేతనదారులకు పనిముట్లు, కనీస సౌకర్యాల కల్పనపై దృష్టిపెట్టాలన్నారు. వేతనదారులను బృందాలుగా విభజించి పనులు ఇవ్వటం ద్వారా సకాలంలో లక్ష్యాలు చేరుకోవచ్చన్నారు. సమావేశంలో ఉపాధి ఏపీఓ ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ త్రినాథులు

నిర్మాణాలు వేగవంతం చేయాలి

పాలకొండ రూరల్: జగనన్న కాలనీలో లబ్ధిదారులచే గృహ నిర్మాణాలు చురుగ్గా జరిపించేలా అధికారులు కృషిచేయాలని సీతంపేట ఐటీడీఏ పీఓ బి.నవ్య అన్నారు. బుధవారం పాలకొండ వచ్చిన ఆమె నగర కమిషనర్ సామంచి సర్వేశ్వరరావుతో కలిసి పట్టణంలోని పలు వార్డు సచివాలయాలను సందర్శించారు. పారిశుద్ధ్య నిర్వహణ, ప్లాస్టిక్ వినియోగం నిషేధంపై అక్కడి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ మేరకు ప్రజలను చైతన్యపర్చాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయాల్లో రికార్డుల నిర్వహణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలపై ఆరా తీశారు.



సచివాలయంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న పీఓ నవ్య, నగర కమిషనర్

మెనూ సక్రమంగా అమలు చేయాలి

గరుగుబిల్లి: ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం రుచికరమైన భోజనం పెట్టాలని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండల కేంద్రంలోని హిక్కింవలస ప్రాథమిక జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను బుధవారం పరిశీలించారు. సరుకుల నిల్వలు, భోజనాల నాణ్యతను పరిశీలించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



తిరువీధిలో పాల్గొన్న గ్రామస్తులు

పాలకొండ రూరల్: మండలంలో అంపిలి గ్రామంలోని రామమందిరంలో సీతారాముల విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. కోటదుర్గమ్మ దేవస్థానం ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ నేతృత్వంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు ముర్రాటలు పట్టుకుని ఊరేగింపుగా వచ్చి స్వామివారికి సమర్పించారు. విగ్రహాల ప్రతిష్ట సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

ఉపాధి పనుల పరిశీలన

జియ్యమ్మవలస: మండలంలోని తురకనాయుడువలసలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఎంపీడీఓ ఎస్.రమేష్ బుధవారం పరిశీలించారు. కెనాల్ అభివృద్ధి పనులు పరిశీలించి వేతనదారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేస్తే రూ.257 వరకు వేతనం వస్తుందన్నారు. పనులను పర్యవేక్షించాలని, పారదర్శకంగా మస్తర్లు నమోదు చేయాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. అవకతవకలకు పాల్పడే సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు.

రంగోలి విజేతలకు ప్రశంసలు



విజేతలకు ప్రశంసా పత్రాలను అందిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

గరుగుబిల్లి: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఆవరణలో నిర్వహించిన రంగోలి పోటీల విజేతలకు కలెక్టర్ నిషాంత్‌కుమార్ బుధవారం ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ పోటీల్లో గరుగుబిల్లికి చెందిన వీఓఏలు చింతల ఉష, గొట్టాపు సుజాత, ఉల్లిబద్రకు చెందిన వీఓఏ శ్రీదేవి, కొంకడివరం వీఓఏ పావని, గొట్టివలస వీఓఏ శ్రీదేవి విజేతలుగా నిలిచినట్లు వైకేపీ ఏపీఎం పి.అప్పలనాయుడు తెలిపారు. విజేతలను కలెక్టర్‌తో పాటు డీఆర్‌డీఏ ఏపీడీ వై.సత్యంనాయుడు, పలువురు అధికారులు అభినందించారు.

అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు

– సబ్ కలెక్టర్ నూరల్‌కమర్



పనసనందివాడ ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరల్‌కమర్

వీరఘట్టం: అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని పాలకొండ సబ్‌కలెక్టర్ నూరల్ కమర్ హెచ్చరించారు. మండలంలోని పనస నందివాడ నాగావళి నదీతీరంలో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నట్లు ఫిర్యాదు రావడంతో బుధవారం ఆయన ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. సబ్ కలెక్టర్ వస్తున్నట్లు సమాచారం తెలియడంతో ఇసుక తవ్వకాలు నిలిపివేశారు. అయితే ఇక్కడ నిత్యం అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు ఆయన గుర్తించారు. రెవెన్యూ, సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఇసుక తవ్వకాలు జరగకుండా చూడాలని సూచించారు. ఇకపై ఇసుక తవ్వకాలు, అక్రమ రవాణా జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందితే సంబంధిత సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వీరఘట్టం మండల కేంద్రంలోని ఓ రేషన్ డిపోను తనిఖీ చేశారు. కార్డుదారులకు సక్రమంగా బియ్యం పంపిణీ చేసేలా చూడాలని తహసీల్దార్ సత్యనారాయణకు సూచించారు.

2.90 లక్షల పనిదినాల కల్పనే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణారావు

భామిని: మండలంలో ఉపాధి వేతనదారులకు మార్చి 31లోగా మరో 2.90 లక్షల పనిదినాలు కల్పించాలని ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. ఏపీఎం జి.తులసీదాస్ అధ్యక్షతన ఉపాధి పనులపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటికే గ్రామాల్లో 3.86 లక్షల పనిదినాలు పూర్తయ్యాయని ఏపీఓ తులసీదాస్ తెలిపారు. వాటికి అదనంగా చేపట్టాల్సిన లక్ష్యాలను సిబ్బందికి వివరించారు. ప్రస్తుతం పనులు చేపడుతున్న గ్రామాలతో పాటు మరిన్ని హేబిటేషన్లలో పనులు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఉపాధి టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

వాహనాల వేలం

కురుపాం: మండల పరిధిలో సారా కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఎస్‌ఈబీ అధికారులు బుధవారం వేలం వేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏడు ద్విచక్ర వాహనాలు, ఒక ట్రాక్టర్(తొట్టితో కలిపి)ను వేలం వేసినట్లు ఎస్సై సీహెచ్ ప్రసాద్ తెలిపారు. వాహనాలు దక్కించుకున్న వారు 18శాతం జీఎస్టీతో కలుపుకొని నగదు చెల్లించాక వాహనాలను వారికి అందజేశారు. ఆయనతో పాటు ఎస్‌ఈబీ సీఐతో పాటు ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు బోధనపై దృష్టి సారించాలి



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈఓ

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ ఎస్.నాగభూషణరావు సూచించారు. మండలంలోని కోటవానివలస పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులకు కృత్యాలతో కూడిన బోధన అందించాలని, వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు.